**కథ**

## హోతా పద్మినీదేవి

# నిజాయితీ

కథా నిలయం
శ్రీకాకుళం

"అమావాస్య వెళ్ళాక తదియనాడు మీ నాన్నగారి నెలమాసికం" అమ్మ చెప్పగా ఉలికిపాటుగా చూసాను. అంటే ఇవాల్టికి వారం రోజులువుంది. నాన్న చనిపోయి అప్పుడే నెల కావస్తోందా? ఎంత తొందరగా గడిచిపోయాయి రోజులు?" నా కళ్ళు తడి అయ్యాయి. ఆయన క్రమశిక్షణ, ఆశయాలు, ఆశయాలకి, వాస్తవాలకి మధ్య నలిగిపోతూ, ఆయన చేసిన జీవనపోరాటం, లేమిలో కూడా చంపుకోని ఆయన స్వాభిమానం. ముఖ్యంగా పరుల సొమ్ముని పాములా చూసే ఆయన నిజాయితీ గుర్తుకొచ్చాయి.

"ఎంత క్లుప్తంగా కానిద్దామన్నా వెయ్యి రూపాయలు ఖర్చవుతాయి. బ్యాంక్‌లో డబ్బు ఎంతవుందో చూడు" అంది అమ్మ కళ్ళు తుడుచుకుంటూ.

బ్యాంక్‌లో ఎంత డబ్బువుందో అమ్మకి తెలియక కాదు. 'నాన్నగారి స్వార్జితం లక్ష రూపాయలు వుండేది. ఆయన కర్మకాండలకి ఇరవై వేలు ఖర్చయ్యాయి. నాన్నగారు అదృష్టవంతులు కాబట్టి అనారోగ్యంతో తీసుకోకుండా హార్ట్ ఎటాక్ వచ్చి చనిపోయారు. యాభై ఆరేళ్ళ అమ్మకి భవిష్యత్తులో ఏ అనారోగ్యం వస్తుందో? ఆ డబ్బుతో ఏ అవసరం వస్తుందో? ముఖ్యంగా చెల్లెలి పెళ్ళి చెయ్యాలి' ఆలోచిస్తూ అన్నాను.

"బ్యాంకులో వున్న డబ్బులోనుంచి ఒక్క రూపాయి కూడా ఖర్చుపెట్టడం నాకిష్టం లేదు. మరో మార్గం ఆలోచిస్తాను" అని నాన్నగారి గదిలోకి నడిచాను.

తలుపులు లేని అలమరా నిండా వరుసగా పేర్చి వున్న 'లా' పుస్తకాలు నన్ను ఆత్మీయంగా పలుకరించాయి. నా వెన్నుతట్టి ధైర్యం చెప్పాయి. చెప్పడం మరచిపోయాను. మా నాన్నగారు సివిల్ లాయర్‌గా ప్రాక్టీసు చేసేవారు. 'లా'ని కాచివడబోసిన మేధావి. సరస్వతి ఆయన్ని కటాక్షించినా లక్ష్మి ఆయన్ని కరుణించకపోవడానికి కారణం ఆయన ఆదర్శాలే! పేదవాళ్ళ కేసులు ఉచితంగా వాదించేవారు. ధనికులనైనా ఫీజు కోసం పీడించేవారు కాదు. ఫీజు డిమాండు చేసేవారు కాదు. పరులసొమ్ము కోసం ఆశపడకపోవడం ఒక్కటే కాదు. ఎవరి డబ్బు అయినా ఆయన దగ్గరవుంటే అది ఎంత స్వల్ప మొత్తమయినా ఆ డబ్బు వాళ్ళకిచ్చేవరకు నిద్రపోయేవారు కాదు. బి.ఎల్. ప్యాసయిన నేను నాన్నగారి ఆశయాలని వొంటబట్టించుకుని, ఆయన అడుగుజాడలలోనే లాయర్‌గా ప్రాక్టీసు చేస్తున్నాను.

ఆ గదిలో రెండు ట్రంకు పెట్టెలు పొడవాటి చెక్కబల్లపై పక్క పక్కనే వున్నాయి. ఒక పెట్టెలో నాన్నగారి బట్టలు..రెండవ పెట్టెలో ఏం వుంటాయో నాకు తెలుసు. నేను ఆ పెట్టె తెరిచి చూసాను. అందులో బాగా పాతబడి అట్ట నలిగిన డైరీ ఒకటి వుంది. నేను ఆ డైరీని తెరిచాను.

నేనెప్పుడూ చూడని చదవని ఆయన డైరీని చూస్తున్నాను. దాంట్లో ఆయన మనసుని బాధపెట్టే సంఘటనలు కాని, సంతోషపెట్టిన అనుభూతులు కాని లేవు; ఆయన లాయర్‌గా ప్రాక్టీసు మొదలుపెట్టిన దగ్గర నుంచి ఆఖరి కేసు వరకు ఏ క్లయింటు ఎంత ఫీజు బాకీ పడ్డాడో తేదీలు సంవత్సరాలతో సహా వ్రాస్తున్నారాయన. నేను ఏదో తెలియని కుతూహలంతో కేలిక్యులేటర్ సాయంతో ఆ అంకెలని కూడడం ప్రారంభించాను. అంతా పూర్తయ్యాక నా గుండె క్షణం కొట్టుకోడం ఆగినట్టయింది. అయిదు లక్షలు. కేసు గెలిచాక క్లయింట్లు న్యాయంగా ఆ డబ్బు నాన్నగారికి ఫీజుగా ఇచ్చి వుంటే! ఆ డబ్బుతో ఎన్ని అవసరాలు తీరి వుండేవి? ఇవాళ నేను చెల్లెలి పెళ్ళి ఎలా చెయ్యాలా అని బుర్ర బద్దలయ్యేలా ఆలోచించక్కర్లేదు. ఒకరకంగా చెప్పాలంటే ఇవాళ ఆ డబ్బు మాదగ్గర వుంటే మా కుటుంబం భద్రతా భావంతో బ్రతికేది.

కేసు గెలిచే వరకు క్లయింట్ నుంచి ఫీజు వసూలు చెయ్యని నిజాయితీ నాన్నగారిది. కేసు గెలిచాక ముఖం చాటేసే ప్రబుద్ధులు వాళ్ళు. నేను వేదనగా నిట్టూరుస్తూ నాన్నగారు చనిపోడానికి ముందు ఏ కేసులు గెలిచిందీ ఆయనకి ఎవరు ఎంత బాకీ పడిందీ చూసాను.

శేక్ రామ్‌కుమార్ వెయ్యి రూపాయలు. రామ్‌కుమార్ టౌన్‌లో హోల్‌సేల్ పేపర్ మర్చెంట్. సూర్యారావు రెండు వేలు. అతనికి నాలుగైదు బట్టల షాపులున్నాయి. ఆ ఇద్దరే నా పాలిట, ఆశాజ్యోతులు. డైరీ మూసి యథాస్థానంలో వుంచుతుండగా పెట్టెలో ఒక పక్కగా రెండు కాగితం పొట్లాలు కనబడ్డాయి.

నేను కుతూహలంగా వాటిని తీసి చూసాను. తెల్ల కాగితంలో చుట్టిన ఒక పొట్లంలో నూటయాభై రూపాయలున్నాయి. కాగితంపై వి.రామస్వామి అని పేరు, అతని ఇంటి ఎడ్రస్సు వ్రాసి వున్నాయి. రెండో పొట్లంలో నూటరెండు రూపాయలు దానిమీద సూర్యారావు పేరు వ్రాసి వుంది. బట్టల షాపులున్న సూర్యారావే! క్లయింటు కోర్టు ఖర్చుల కోసం ఇచ్చిన డబ్బులో మిగిలిన సొమ్ముని క్లయింటుకి తిరిగి ఇవ్వడం నాన్నగారి నిజాయితీకి అతి పెద్ద ఉదాహరణ. ఏకారణం చేతయినా క్లయింటు రావడం ఆలస్యమైనా ఎన్ని నెలలయినా ఆ డబ్బు అలాగే భద్రంగా ఆయన దగ్గర వుండేది తప్ప ఎంత అవసరమైనా ఆ డబ్బు ఖర్చుపెట్టే వారు కాదాయన.

రామస్వామికి ఇవ్వవలసిన డబ్బున్న పొట్లంపై సంవత్సరం, తేదీ చూసాను. 2005వ సంవత్సరం, మార్చి నెల 6వ తేదీ..రెండు సంవత్సరాలు. సుదీర్ఘమైన రెండు సంవత్సరాలు భద్రంగా నాన్నగారు దాచిన ఆ డబ్బు రామస్వామికి అందచెయ్యగలనో లేదో, ఎందుకంటే రామస్వామి ఊరొదిలి వెళ్ళిపోయి రెండు సంవత్సరాలు. ఆలోచిస్తూ పెట్టె మూసాను.

○○○

"మీరు గెలిచిన కేసులో, మా నాన్నగారికి ఫీజుగా వెయ్యి రూపాయలు ఇవ్వవలసి వుంది" అని నేను చెప్పగానే క్షణకాలం శేక్ రామ్‌కుమార్ ముఖంలో రంగులు మారాయి. తరువాత ముఖంలో నిజాయితీని ప్రస్ఫుటింపచేస్తూ అన్నాడు.

"నేను ఫీజు బకాయిపడ్డానా? ఎప్పటికేసది? గెలిచి దగ్గరగా ఆరునెలలు. కేసు గెలవగానే ఫీజు మొత్తం ఇచ్చేసాను. పాపం! పెద్దాయన మరచిపోయి వుంటారు..." అన్నాడు తానేమీ ఇవ్వక్కర్లేదని, కాదు ఇవ్వబోనని స్పష్టం చేస్తూ.

నేను హతాశుడినయ్యాను. అతను బాకీ లేనిదే నాన్నగారు డైరీలో వ్రాయరు. శేక్ ధోరణి అర్థమయింది.

"కేసు వాదించిన నాన్నగారు లేరు. కేసు గెలిచిన శేక్ ఆయన ఫీజు ఎగ్గొట్టాడు. రేవు దాటాక తెప్పతో పనేముంది?"

నేను నిస్సహాయంగా వెనుదిరిగాను. నా కాళ్ళు సూర్యారావు షాపు వైపు దారితీసాయి.

"నేను నమస్కారం" అనగానే ప్రతి నమస్కారం కూడా చెయ్యకుండా "ఏం పంతులుగారూ! నాన్నగారు పోయారుట!" అని పరామర్శించాడు.

నాన్నగారు పోయినప్పుడు అంతిమదర్శనం కోసం కూడా రాని మనిషి ఇప్పుడు నేను అతని కోసం వెళ్ళగా పరామర్శిస్తుంటే నాలోని అణువణువు భగ్గుమంది. తమాయించుకుని, జేబులోనుంచి కాగితపు పొట్లాన్ని తీసి ఆయన ముందు జాపాను. "మా నాన్నగారి పెట్టెలో ఈ డబ్బుంది. కోర్టు ఖర్చుల నిమిత్తం మీరు ఆయనకిచ్చిన డబ్బులో మిగిలినది. మీ సొమ్ము మీకు అందచెయ్యాలని వచ్చాను."

నేను చెబుతుండగానే ఎగబడినట్టు నా చేతిలో నుంచి ఆ పొట్లాన్ని అందుకున్నాడు. పొట్లం విప్పి అందులోని డబ్బుని కళ్ళకద్దుకుని షర్టు జేబులో వేసుకున్నాడు.

"చాలా సంతోషం" అన్నాడు.

నేను చిన్నగా దగ్గి గొంతు సవరించుకుని మొహమాటంగా అడిగాను.

"మీరు మా నాన్నగారికి రెండువేలు ఫీజు ఇవ్వాలి. ఆయన డైరీలో ఈ విషయాన్ని ప్రస్తావించారు కూడా"

తేలుకుట్టినట్టు ఉలిక్కిపడ్డాడు సూర్యారావు.

"ఏమిటీ, నేను మీ నాన్నగారికి బాకీపడ్డానా? నేను ఎవరికీ బాకీ లేను. ఆయనో మీరో పొరపాటుపడివుంటారు" అన్నాడు ముఖం చిట్లిస్తూ.

"మానాన్నగారు పొరపాటున కూడా పరులసొమ్ము ఆశించరు" పౌరుషంగా అన్నాను.

"నిజాయితీ ఆయన ఒక్కడి సొత్తే అన్నట్టు మాట్లాడతావేమిటి? అక్కడికి నేను ఊరి వాళ్ళ సొత్తుని కాజేసినట్టు. నేను మీ నాన్నకే కాదు. ఎవరికీ బాకీ లేను" అతను స్వరం పెంచాడు. షాపులోని సేల్స్‌మేన్, కస్టమర్లు తలలు తిప్పి నా వైపు చూస్తున్నారు. నాకు అవమానంతో తల కొట్టేసినట్టయింది.


సూర్యారావు అబద్ధం చెబుతున్నాడని వాళ్ళలో ఎంతమందికి తెలుసు? నన్ను మోసగాడినన్నట్టు ఆయన చూస్తుంటే నా తల వాలిపోయింది. నేను తల దించుకుని అక్కడనుంచి కదిలాను.

"ఇదుగో పంతులూ!" వెనుకనుంచి అతను పిలిచాడు. అప్రయత్నంగానే వెనుదిరిగాను.

"ఇలా దగ్గరకి రా" నాలో అణగారిన ఆశ మళ్ళీ చిగురించింది.

"ఒకవేళ నాన్నగారికి తనివ్వవలసిన డబ్బు గుర్తొచ్చిందేమో!" అనుకుంటూ కౌంటర్ దగ్గరకి నడిచాను.

"ఇంట్లో జరుగుబాటుకు ఇబ్బందిగా వుందా? ఇంద ఈ డబ్బుంచు." యాభై రూపాయల నోట్లు జేబు



లోనుంచి తీసి అందివ్వబోయాడు. నా ముప్ఫయ్యేళ్ళ జీవితంలో అంతటి అవమానాన్ని ఎప్పుడూ ఎదుర్కో లేదు.

శరీరంలోని రక్తమంతా ముఖంలోకి పొంగివచ్చినట్టయింది.

"నేను మిమ్మల్ని యాచించడానికి రాలేదండీ?" అని అక్కడనుంచి వడివడిగా బయటకొచ్చాను. మనసులో అస్పష్టమైన వేదన. 'పరుల సొమ్ము పాములాంటి దంటారే! కానీ ఈ మనుషులు డబ్బు దగ్గర న్యాయాన్యాయాలని నీతి నియమాలని విస్మరించి ఎందుకింత దిగజారిపోయి ప్రవర్తిస్తారు? ఈ లోకంలో నిజాయితీకి విలువలేదా?"

ooo

నేను వాదించిన కేసు గెలిచాను. క్లయింట్ వెయ్యి రూపాయలు ఫీజిచ్చాడు. విషయం అమ్మతో చెప్పాను.

"భగవంతుడే దారి చూపించాడు. మీ నాన్నగారి మాసికం ఖర్చులకి డబ్బు వెతుక్కోనవసరం లేదు" అంది ఆవిడ.

"అంతకంటే ముఖ్యమైన పని మరొకటి వుంది" అంటూ రామస్వామికి డబ్బు అందచెయ్యాలని చెప్పాను.

"ముందు ఆ పని చెయ్యి. లేకపోతే మీనాన్నగారి ఆత్మశాంతించదు."

నేను గతంలో రామస్వామి నివాసం వుండే ఏరియాకి వెళ్ళి అతన్ని గురించి ఇరుగుపొరుగు వాళ్ళని విచారించాను.

"మీ నాన్నగారు అతని కేసు గెలిపించినప్పటికీ వచ్చిన డబ్బుని అప్పుల వాళ్ళు గెద్దల్లా తన్నుకుపోయారు. కుటుంబం గడవని పరిస్థితి. అందుకే ఊరొదిలి వెళ్ళిపోయాడు పాపం!" అన్నాడొకాయన సానుభూతిని కనబరుస్తూ.

..ఆ విషయం నాక్కూడా తెలుసు. కానీ ఊరొదిలి వెళ్ళాక ఫలానా చోట వున్నానని మీకెవరికైనా ఉత్తరం వ్రాసారా? ఆయన? ఇరుగుపొరుగు వాళ్ళు కదా! ఆ మాత్రం స్నేహసంబంధాలు మీ మధ్య వున్నాయనే అనుకుంటాను.

అతను జవాబిచ్చేలోగా మరొకతను అన్నాడు. "ముఖం చెల్లక, ఎవరికీ చెప్పకుండా రాత్రికి రాత్రి ఊరొదిలిపోయిన అతను మాకెందుకు ఉత్తరాలు వ్రాస్తాడండీ?"

"ఏడాది క్రిందట ఏదో పనిమీద విజయవాడ వెళ్ళాను. మా ఆడాళ్ళకి చీరకొందామని. 'మన్‌హర్' షాపుకి వెళ్తే అక్కడ రామస్వామి సేల్స్‌మెన్‌గా కనబడ్డాడు. మరి ఇప్పుడు అదే షాపులో పనిచేస్తున్నాడో లేదో?" అప్పుడే సైకిల్‌మీద అక్కడకొచ్చిన వ్యక్తి అన్నాడు.

"ఆ షాపులో కాకపోతే మరోషాపులో పనిచేస్తుంటాడు. గవర్నమెంటు ఉద్యోగం కాదు కద ట్రాన్స్‌ఫర్స్ వుండడానికి" అన్నాడు మరో వ్యక్తి.

"ఇంతకీ రామస్వామితో మీకేం పని బాబూ..మళ్ళీ ఏదైనా కేసు.."

అతని మాట పూర్తికాకుండానే "పనుంది" అని క్లుప్తంగా చెప్పి అక్కడనుంచి వచ్చేసాను.

ooo

విజయవాడ వెళ్ళి షాపులో విచారిస్తే రామస్వామి అక్కడ పని మానేసి చాలా నెలలయిందని, ఇప్పుడెక్కడున్నాడో తెలియదని చెప్పారు. నేను నిస్పృహగా వెనుదిరగబోతుండగా షాపులోకి వస్తున్న యువకుడొకడు అతనూ బహుశా అక్కడే పనిచేస్తున్నాడనుకుంటాను. "రామస్వామి వైజాగ్‌లో మధురవాడలో, వున్నాడు సార్" అన్నాడు.

"ఎక్కడ పనిచేస్తున్నాడు? ఎడ్రస్ తెలుసా?"

"తెలుసుసార్!" అని ఎడ్రస్ చెప్పాడు. అతనికి ధన్యవాదములు తెలియచేసి రైల్వేస్టేషన్‌కి వెళ్ళాను.

ooo

"మీరు జగన్నాధంగారబ్బాయి భాస్కర్ కదూ?" మధురవాడలో బస్సు దిగి రోడ్డు వార నడుస్తున్న నేను ఎదురుగా వస్తున్న వ్యక్తి అడగడంతో ఆగి ఆ వ్యక్తిని పరిశీలనగా చూసాను.

అతను రామస్వామి! ఎన్ని సంవత్సరాల తర్వాతయినా అతన్ని పోల్చుకోగలను. వెతకబోయిన తీగ కాలికి తగిలినట్టు..ఆడబోయిన తీర్థం ఎదురయినట్టు ఏ వ్యక్తికోసం, నేను వెతుకుతున్నానో అతనే నాకెదురయి, పలుకరించడంతో సంభ్రమంతో తబ్బిబ్బయ్యాను. నా తలమీద నుంచి పెద్దబరువు దింపినట్టు రిలీఫ్‌గా ఫీలయ్యాను కూడా.

"అచ్చం మీ నాన్నగారిలాగే వున్నారు బాబూ! అహ! మిమ్మల్ని చూస్తే మీ నాన్నగారిని చూస్తున్నట్టే వుంది." అతని కళ్ళలో తడి.

"బాగున్నారా?"

"బాగున్నాను బాబూ! మీ నాన్నగారి దయవల్ల. రండి, ఇంటికి వెళ్దాం" అని నా భుజం చుట్టూ చెయ్యి వేసాడు. ఆ స్పర్శలోని ఆత్మీయత నా అణువణువుని పలుకరించింది. అతనే ఆటో పిలిచాడు.

రామస్వామి ఇల్లు...నాకెదురుగా కూర్చున్న రామస్వామి అడిగేదు.

"నాన్నగారు కులాసాగా వున్నారా బాబూ?"

"పోయారండి...నెల రోజులు కావస్తోంది"

షాకయినట్టు అతని ముఖమే చెబుతోంది. ముఖంలో విచారం కళ్ళలో తడి. లోపలికి వెళ్ళి భార్యని పిలుచుకొచ్చాడు. ఆమె ముఖంలో

## ఇలియానా ఆఫర్

గ్లామరస్ గాళ్ ఇలియానా తెలుగులో దాదాపు కోటి వరకూ డిమాండ్ చేస్తోంది. మరి అంత డబ్బు ఇస్తున్నప్పుడు ఆమె అందాల్ని తెరపై ఆరేసి సొమ్ము చేసుకోవాలనే చూస్తున్నారు నిర్మాతలు. ఈ సంగతి గ్రహించిన ఇలియానా తనకి నటిగా కాస్తయినా పేరు రావాలంటే కొన్ని మంచి పాత్రలు వేయాలనుకుంటోందిట. అందుకని తన 'నటించడానికి' తగిన స్కోప్ వున్న వేషంతో వచ్చే నిర్మాతలకు తన పారితోషికాన్ని తగ్గిస్తానంటోందిట. మరి ఆమె ఆఫర్‌ని ఎంతమంది నిర్మాతలు 'క్యాష్' చేసుకుంటారో!



కూడా విచారం. సానుభూతి వచనాలు చెప్పి పది నిముషాల తర్వాత టిఫిన్ తెచ్చి పెట్టింది.

మీ నాన్నగారు దేముడులాంటి మనిషి. నిజాయితీలో ఆయన తర్వాతే ఎవరి పేరయినా చెప్పుకోవాలి. నాకున్న కొద్దిపాటి ఆస్తి దాయాదుల పరమయినప్పుడు మీ నాన్నగారే కేసు టేకప్ చేసి వాదించారు. ఆయనకి ఫీజివ్వడానికి నా దగ్గర అప్పట్లో చిల్లిగవ్వ లేదు. ఒక పూట తింటే, మరో పూట పస్తుండేవాళ్ళం. ఆయన ఉచితంగా కేసు వాదిస్తున్నారని అభిమానపడి నా భార్య మెడలోని మంగళసూత్రాలని నానుతాడుని అమ్మి ఆ డబ్బు ఆయనకి ఫీజుగా ఇవ్వబోయాను. ఆ విషయాన్ని ఎలా తెలుసుకున్నారో లేక ఊహించారో నన్ను నిలదీసి అడిగారు. ఆయన ముందు అబద్ధం చెప్పలేక, నిజం చెప్పేసాను. కేసు గెలిచి నీకు డబ్బు వచ్చాక నా ఫీజు ఇద్దువుగానీలే. కానీ అందుకోసమని నీ భార్య మెడలోని మాంగళ్యాన్ని అమ్మడం తప్పుకదూ? అని నేను బంగారం అమ్మిన షాపునకు నన్ను తీసుకెళ్ళారు. అప్పట్లో ఆ షాపు ఓనరు కేసు మీ నాన్నగారే టేకప్ చేసారు. అందువల్ల ఏ గొడవా లేకుండా వ్యవహారం సెటిలయింది. నా భార్య మెడలోకి మళ్ళీ మాంగల్యం వచ్చి చేరింది. కేసు గెలిచి దాయాదుల నుంచి డబ్బు వచ్చిందని తెలియగానే అప్పులవాళ్ళు నన్ను చుట్టుముట్టారు. వచ్చిన డబ్బు అప్పులు తీర్చడానికే, సరిపోయింది. ఇంక అక్కడ వుండలేక, ఎలా బ్రతకాలో తెలియక చాలా ఊళ్ళు తిరిగి చివరికి ఇక్కడ" గాద్గదిక స్వరంతో చెబుతున్నాడు రామస్వామి. "ఇప్పుడు బాగున్నాను. పాత పేపరుకొని రీసైక్లింగ్ చేసే ఫ్యాక్టరీకి అమ్ముతున్నాను. మీ నాన్నగారి ఫీజు ఇవ్వాలనుకుంటూండగా నా భార్యకి ఆరునెలల క్రిందట హార్ట్ ఆపరేషన్ అయింది" అతని స్వరంలో పశ్చాత్తాపం. నాన్నగారిని మళ్ళీ చూడలేననే విషాదం అశ్రురూపంలో వ్యక్తమవుతోంది.

ఇన్నాళ్ళకి నిజమైన మనిషిని చూస్తున్నందుకేమో అతని కళ్ళు కూడా తడయ్యాయి. వున్నట్టుండి నేను వచ్చిన పని గుర్తుకొచ్చి జేబులో నుంచి పొట్లాన్ని బయటికి తీసాను.

"ఇది మా నాన్నగారి పెట్టెలో ఆయన మరణానంతరం దొరికింది. మీరు ఆయనకి కోర్టు ఖర్చులకోసం ఇచ్చిన డబ్బులో మిగిలినదది. ఈ డబ్బు మీకు ఇవ్వాలని మీరు విజయవాడలో వున్నారని ఎవరో చెప్తే అక్కడికి వెళ్ళాను. అక్కడ గతంలో మీరు పనిచేసిన బట్టల షాపులో ఎవరో చెప్పారు మీరిక్కడ వున్నారని"

రామస్వామి ఆ పొట్లాన్ని విప్పి దాంట్లోని డబ్బుని దిగ్భ్రమగా చూస్తూ అడిగేడు.

"ఈ డబ్బు నాకివ్వాలని మీరు విజయవాడ వెళ్ళి...అక్కడనుంచి ఇక్కడకొచ్చి..చాలా శ్రమ పడ్డారు. ఎంత డబ్బు ఖర్చు? మీ నాన్నగారి రక్తమే మీలోనూ ప్రవహిస్తోంది. అదే నిజాయితీ...అదే మంచితనం..." ఆయన కళ్ళలో నీళ్ళు.

ఒక్కొక్కసారి పొగడ్తలు కూడా ఇబ్బందిని కలుగజేస్తాయి. కుర్చీలో ఇబ్బందిగా కదిలాను.

"మీ సొమ్ము మీకు అందచెయ్యడం కూడా గొప్ప విషయమేనా?" వెళ్ళడానికి ఉద్యుక్తుడినవుతూ కుర్చీలో నుంచి లేచి నిలబడ్డాను.

"ఒక్క నిముషం బాబూ! రామస్వామి లేచి లోపలికి వెళ్ళాడు. రెండు నిముషాల తర్వాత వచ్చి చేతిలోని డబ్బుని నా ముందుకి జాపాడు.

"మీ నాన్నగారికి నేనివ్వవలసిన ఫీజు తీసుకోండి"

"మీరు ఆయనకి ఫీజు బాకీ పడ్డట్టు నాతో ఆయన చెప్పలేదే. కొన్నేళ్ళ క్రిందట కేసు గెలిచాక ఫీజు ఇద్దువుగానిలే అని నాన్నగారు నిజంగా అతనితో అన్నారో లేక అతన్ని అనునయించడానికి అన్నారో తెలియదు. రామస్వామి తనకి నిజంగా ఫీజు బకాయిపడి వుంటే ఆ విషయాన్ని ఆయన డైరీలో వ్రాసి వుండేవారు కదా! ఆ మాటే అతనితో అన్నాను.

"నోటి మాట చాలదా బాబూ! కాగితం మీద వ్రాసి పెట్టాలా? నూట యాభై రూపాయలు నాకు ఇవ్వడం కోసం అంతకు నాలుగు రెట్లు డబ్బు ఖర్చుపెట్టి ఇంత దూరం వచ్చారే! ఎందుకని? నా సొమ్ము నాకు ఇవ్వాలనే నిజాయితీ మీలో వుండబట్టే కదా? మీ నాన్నగారు నేను చేసిన సహాయానికి ప్రతిగా కాకపోయినా ఆయన ఋణాన్ని కొంతయినా తీర్చుకోవాలని నాకు మాత్రం అనిపించదా? మీరీ డబ్బు తీసుకోకపోతే ఆయన ఋణాన్ని తీర్చుకోలేకపోయాననే బాధ నన్ను జీవితాంతం వెంటాడుతూనే వుంటుంది. తీసుకోండి దయవుంచి తిరస్కరించకండి"

"క్షమించండి. మీరు మా నాన్నగారికి బాకీ వున్న విషయం ఆయన డైరీలో ఎక్కడా ప్రస్తావించలేదు. నేను ఈ డబ్బు తీసుకోలేను. తీసుకుంటే ఆయన్ని అవమానించినట్టే అవుతుంది."

"అది కాదు బాబూ!" అతనేదో చెప్పబోయాడు.

"మన్నించండి" అని ముందుకి కదిలాను.

మరో రెండు రోజుల తరువాత నాన్నగారి మాసికం. అప్పుచేసి ఆ కార్యక్రమాన్ని నిర్వహించడం నా అభిమతం కాదు. అది నాన్నగారి ఆశయాలకి విరుద్ధం కూడా. అయినా చనిపోయినవాళ్ళ ఆత్మశాంతి కోసం కర్మకాండ చెయ్యక్కర్లేదు. వాళ్ళ ఆశయాలకి విరుద్ధంగా ప్రవర్తించకుండా వుండడమే వాళ్ళకి నిజమైన ఆత్మశాంతి.

○

## సుస్మితా..! సుస్మితా!!

రాజ్‌కపూర్ వంశం నుంచి ఇటీవలే బాలీవుడ్ తెరపైకి వచ్చిన రణబీర్ కపూర్ కుర్ర ఫాన్స్‌లో మంచి పాపులారిటీ సంపాదించుకున్నాడు. అతని సినిమా 'సావరియా' చెప్పుకోదగిన విజయం సాధించకపోయినా గ్లామరస్ హీరోగా రణబీర్‌కి మంచి పేరే తెచ్చింది. ఎంతగా అంటే దాదాపు పదేళ్ళుగా బాలీవుడ్‌లో వుంటున్న సుస్మితా సేన్ సైతం రణబీర్ క్యూట్‌నెస్‌కి తెగ ఇదైపోయిందిట. కుదిరితే గనక ఓ సినిమాలో అతనితో నటించాలని వుంది అని సెలవిచ్చిందిట సుస్మిత. బానే వుంది, మరీ అంత చిన్న హీరోతో ఈ టింగణా మేడమ్ హీరోయిన్ ఏంటీ? అని బుగ్గలు నొక్కుకుంటున్నారు సినీ జనాలు.

